క్లుప్తంగా

అత్తార్ జన్మదిన వేడుకలు



అత్తార్‌చాంద్‌బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కదిరి టౌన్: మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా జన్మదిన వేడుకలు సోమవారం కదిరిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం, ఆయన నివాసంలోను నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేసి, సన్మానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.ప్రణీత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్, కౌన్సిలర్లు లింగాల కృపాకర్‌రెడ్డి, రాంప్రసాద్, కదిరి రూరల్ మండల కన్వీనర్ మణికంఠనాయక్, వైస్ ఎంపీపీ ఆనందనాయక్, మధుసూదనరెడ్డి, నాగార్జుననాయక్, కృష్ణానాయక్, ఆది, చలపతి, నల్లచెరువు మండల కన్వీనర్ రవి కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించండి

కదిరి టౌన్: పట్టణంలోని ఎర్రకోట కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కాలనీ వాసులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి డాక్టర్ నాగన్న మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 34 వార్డులో సర్వే నంబర్ 1778-1లో నిరుపేదలు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారన్నారు. రెండేళ్లవుతున్నా కాలనీలో తాగునీరు, విద్యుత్ సరఫరా, రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఎస్‌డీటీ కె.వి.రవిప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శేఖర్, స్వప్న, సుగుణమ్మ, రమణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



శ్రీ లలిత నాట్య కళానికేతన్ కళాకారులు

ధర్మవరం అర్బన్: అన్నమయ్య జయంతి సందర్భంగా ధర్మవరంలోని శ్రీ లలిత నాట్యకళానికేతన్ కళాకారులు అన్నమయ్య సంకీర్తనలకు నృత్య ప్రదర్శనతో అలరించారు. గురువులు బాబు బాలాజి, కమల బాలాజి, రామలాలిత్యల ఆధ్వర్యంలో శిష్య బృందం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం ముందు ఉన్న అన్నమయ్య విగ్రహం వరకు నగర సంకీర్తన చేశారు. అనంతరం నృత్య కళాకారులు కోలాటం, అన్నమయ్య సంకీర్తనలకు నృత్య నీరాజనం అందించారు.

వైభవంగా దుర్గమ్మ పరుష

ధర్మవరం అర్బన్: పట్టణంలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి రథోత్సవం ముగిసిన అనంతరం మూడు రోజులపాటు నిర్వహించే దుర్గమ్మ పరుష సోమవారం వైభవంగా ప్రారంభమైంది. దుర్గమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గాజులు, బొమ్మలు, ఇంటి సామగ్రి, అలంకరణ వస్తువుల కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడాయి.

ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలి


ప్రశాంతి నిలయం: కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే పునరుద్ధరించాలని పెనుకొండ సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి కోరారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

చెన్నేకొత్తపల్లి: పేద ప్రజలకు సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలని దామాజిపల్లి మహిళలు సోమవారం చెన్నేకొత్తపల్లి బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

నాటుసారా తయారీదారుల అరెస్ట్

కదిరి అర్బన్: మండల పరిధిలోని కొండ ప్రాంతాల్లో నాటుసారా తయారు చేస్తున్న నలుగురిని సోమవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీధర్ అరెస్ట్ చేశారు. నిందితులను పీడీఎమ్ కోర్టులో హాజరుపరచినట్లు వివరించారు. అలాగే అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్, పుట్టపర్తి డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్, కదిరి ఎక్సైజ్ సిబ్బంది ఉమ్మడిగా చేపట్టిన తనిఖీల్లో బాలప్పగారిపల్లితండా సమీపంలోని అటవీ ప్రాంతంలో 150 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

భక్తి శ్రద్ధలతో మొలకల పున్నమి



ఈదులపల్లిలో మొలకలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

ముదిగుబ్బ/ తాడిమర్రి/ ధర్మవరం రూరల్: నియోజకవర్గంలో మొలకల పున్నమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముదిగుబ్బ మండలం ఈదులపల్లి, తాడిమర్రి మండలం చిల్లకొండయ్యపల్లి, ధర్మవరం మండలం వసంతపురంలో మహిళలు, బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి మొలకలకు పూజలు చేశారు. అనంతరం మొలకలను తలపై పెట్టుకుని తప్పెట్లు, మేళతాళాల నడుమ ఊరేగింపు నిర్వహించారు.



రాప్తాడు గ్రంథాలయంలో గేమ్స్ ఆడుతున్న విద్యార్థులు



కనగానపల్లి గ్రంథాలయంలో కోలాటం నేర్చుకుంటున్న విద్యార్థులు



కనగానపల్లి గ్రంథాలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

విజ్ఞానం.. వినోదం

- విజ్ఞాన సముపార్జనలో బాల బాలికలు
- చదువుతో పాటు పలు నైపుణ్యాల్లో శిక్షణ
- వేసవిని ఆస్వాదిస్తున్న విద్యార్థులు

కనగానపల్లి/ రాప్తాడు: నిత్యం పాఠ్య పుస్తకాలతో కుస్తీ పడుతూ ఏడాదంతా కష్టపడిన విద్యార్థులు.. పరీక్షల అనంతరం వేసవి విరామాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సెలవుల్లో చిన్నారులు పుస్తక పఠనం, విజ్ఞానం పెంపొందించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని అన్ని గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. విజ్ఞానం, వినోదం, సంగీతం, నృత్యం, ఇంగ్లిష్ భాష, భావ వ్యక్తీకరణ తదితర అంశాలపై పట్టు సాధిస్తున్నారు. బాల సాహిత్యం, దేశ నాయకుల జీవిత చరిత్రలు, దేశభక్తి పెంపొందించే పుస్తకాలను చదువుతున్నారు. గ్రంథాలయాల్లో స్టోరీ టెల్లింగ్ (ఆకట్టుకునేలా కథలు చెప్పడం) నీతి కథలు, మానవీయ ప్రవర్తన, ఎదుట వ్యక్తిని ఆకట్టుకునేలా కథలు చెప్పడం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, పాటలు పాడటం, నృతం తదితర అంశాల్లో నిపుణులైన ఉపాధ్యాయులు రిసోర్స్ పర్సన్లను ఏర్పాటు చేసి తరగతులు చెప్పిస్తున్నారు. కనగానపల్లి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా గురువు సుబ్బరాయుడు, కోలాటం మాస్టారు వినయ్, ఆకట్టుకునే కథలు, తెలుగు గ్రామర్ చెప్పే ట్యూటర్ నరేష్, గణిత ఉపాధ్యాయుడు రామాంజినేయులు గణితంపై మెలకువలు నేర్పిస్తున్నారు. శిబిరానికి హాజరైన విద్యార్థులకు బహుమతులు బిస్కెట్లు, అరటి పండ్లు అందిస్తూ ఉత్సాహపరుస్తున్నారు.

ప్రత్యేక తరగతుల నిర్వహణ ఇలా..

- ఉదయం 8 నుంచి 8:30 గంటల వరకు కథలు చదివి వినిపించడం
- 8:30 నుంచి 10 గంటల వరకూ పుస్తక పఠనం
- 10:10 నుంచి 10:30 గంటల వరకు పుస్తక సమీక్ష
- 10:30 నుంచి 11 గంటల వరకూ కథలు చెప్పడం
- 11 నుంచి 12 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయిటింగ్, మ్యూజిక్, డ్యాన్స్, డ్రామా, చెస్, క్యారమ్స్, క్విజ్, జీకే, ఇతర నైపుణ్య శిక్షణ

కథలంటే చాలా ఇష్టం



నాకు కథలంటే చాలా ఇష్టం. శిక్షణ తరగతుల్లో ఎంతో ఆసక్తి కలిగించే కథలు చెబుతున్నారు. మంచి కథల పుస్తకాలు చదువుతున్నాను. నీతి కథలు చాలా బాగున్నాయి. ఇంగ్లిష్, సైన్స్ తదితర అంశాలను వివరిస్తున్నారు. ఇవి భవిష్యత్‌లో నాకు ఎంతగానో ఉపయోగపడతాయి. నాలెడ్జ్ పెంచుకుంటున్నాను.

– హని, 7వ తరగతి, రాప్తాడు

బొమ్మలు వేస్తున్నా



చిత్రలేఖనంపై ఆసక్తితో గ్రంథాలయంలో ఇస్తున్న శిక్షణకు వెళ్తున్నాను. వివిధ రకాల బొమ్మలు వేయడం నేర్చుకుంటున్నా. పేపర్‌తో పలు రకాల ఆకృతులు తయారు చేయడం బాగుంది. సులభంగా బొమ్మలు ఎలా వేయాలో చెబుతున్నారు. ఇలాంటి మెలకువలు తెలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– వర్షిత్, 5వ తరగతి, రాప్తాడు

ధైర్యంగా మాట్లాడుతున్నా..



వేసవి శిక్షణ తరగతులు ఎంతో ఆసక్తికరంగా ఉన్నాయి. నాతో మాట్లాడిస్తున్నారు. అందువల్ల నాలో స్టేజ్ ఫియర్ పోతోంది. కథల పుస్తకాలు చదివి వినిపిస్తున్నాను. ఇలా చేయడం వల్ల నాలో తెలియని అనుభూతి కలుగుతోంది. ఈ శిబిరం నాకు ఎంతో ఉపయోగపడుతోంది.

– భవిష్య, 5వ తరగతి, రాప్తాడు

విజ్ఞానం పెంచుకోవాలి



విద్యార్థులకు చదువుతో పాటు ఇతర నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. బాల్యం నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి. స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయిటింగ్, మ్యూజిక్, డ్యాన్స్, డ్రామా, చెస్, క్యారమ్స్, క్విజ్, జీకే, ఇతర నైపుణ్య శిక్షణ విద్యార్థులకు ఉపయోగపడుతుంది.

– దాసరి గోవింద్, గ్రంథాలయాధికారి, కనగానపల్లి

భక్తిశ్రద్ధలతో సత్యసాయి శ్రీగిరి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

పుట్టపర్తి టౌన్: బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రశాంతి నిలయం ముఖ ద్వారం వద్ద సత్యసాయి చిత్రపటాన్ని రథంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని లాగారు. కార్యక్రమంలో దేశ విదేశీ భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అయ్యప్ప విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు



పూజలు చేస్తున్న హంపి పీఠాధిపతి

ధర్మవరం రూరల్: పట్టణంలోని కేశవనగర్‌లో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య స్వామి హాజరయ్యారు.

నేత్రపర్వంగా రథోత్సవం

కొత్తచెరువు: మండల కేంద్రం కొత్తచెరువులో సంగమేశ్వర స్వామి రథోత్సవం సోమవారం నేత్రపర్వంగా సాగింది. భక్తులు తొలుత రథం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఐదు గంటలకు రథోత్సవం మొదలైంది. సాయంత్రం అశేష భక్త జన సందోహం నడుమ రథం ముందుకు సాగింది. స్థానిక ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు (1995-1996 పదో తరగతి బ్యాచ్) భక్తులకు నీళ్ల ప్యాకెట్లు, మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో పాదయాత్ర వాల్మీకి శంకర, కళ్యాణ్, అక్బర్, కిరణ్, నాగ మోహన్‌రెడ్డి, బాషా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఉత్సవాలు ప్రారంభం

గాండ్లపెంట: మలమీదపల్లి పంచాయతీ కోటూరులో చింతమాను గంగమ్మ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి గుడి చుట్టూ ప్రదక్షిణలుచేసి బోనాలు పట్టారు. రాత్రికి మలకల పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి జ్యోతులు పట్టి ధాన్యపు మలకలను నైవేద్యంగా సమర్పించారు.

కొవ్వొత్తులతో ర్యాలీ



ముదిగుబ్బ: వీర జవాన్ మురళీనాయక్ మృతికి సంతాపం తెలుపుతూ సోమవారం రాత్రి ఏబీ పల్లి తండావాసులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మృతికి సంతాపంగా కాసేపు మౌనం పాటించారు.

చిన్నారులపై సకాలంలో స్పందించండి

ధర్మవరం రూరల్: చిన్నారుల సమస్యలపై తల్లిదండ్రులు సకాలంలో స్పందించాలని సీడీపీఓ శ్రీలక్ష్మి సూచించారు. సోమవారం పోతుకుంట పాఠశాలలో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, ఐసీడీఎస్, జిల్లా బాలల సంరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో నేటి తరం పిల్లలు ఆన్‌లైన్ వేధింపులకు గురికాకుండా ఎలాంటి విధి విధానాలను నిర్వహించాలి అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓమాట్లాడుతూ పిల్లల సమస్యల గురించి పట్టించుకోకుంటే వేరే సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో ఇండియా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, సూపర్‌వైజర్ అరుణ, కౌన్సిలర్ శివలత, యూత్ అంబాసిడర్ సంజీవరాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తిక్కయ్యస్వామి సమారాధన

ధర్మవరం రూరల్: వసంతపురంలో ప్రసిద్ధిగాంచిన తిక్కయ్యస్వామికి సోమవారం సమారాధన పూజలు నిర్వహించారు. పూజారి సిద్దయ్య స్వామి వారిని వెండి ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వీరబ్రహ్మేంద్రస్వామి నాటకాన్ని ప్రదర్శించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ధర్మకర్త తరుణ్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు.

చౌడేశ్వరీ విగ్రహ ప్రతిష్ట



పూజలు చేయిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి సమీపంలో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట సోమవారం వైభవంగా జరిగింది. సర్పంచ్ రూప, వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్టల కేశప్ప, రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేత దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత కొత్తకోట కేశప్ప, నియోజకవర్గ లీగల్ సెల్ విభాగం అధ్యక్షుడు నాగమల్లేశ్వర్ రెడ్డి, కొత్తకోట సర్పంచ్ నాగమణి, మండల బూత్ లెవల్ మేనేజర్ పతంజలి, నీలూరి ఈశ్వర్, రఘు పాల్గొన్నారు.

సీతారామ విగ్రహ ప్రతిష్ట ప్రారంభం

నల్లమాడ: సోమగుట్టపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

మాంసం విషయంలో గొడవ

ధర్మవరం అర్బన్: చెన్నేకొత్తపల్లి సమీపంలోని ఓ ధాబాలో బీఫ్ (మాంసం) అమ్మరాదని సోమవారం రాత్రి కొందరు వ్యక్తులు నిర్వాహకులపై దాడి చేశారు. అక్కడ భోజనం చేస్తున్న వారు వారించే ప్రయత్నం చేయగా.. వారిని సైతం కొట్టారు. దీంతో బాధితులు ధర్మవరం వచ్చి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం కళాజ్యోతి సర్కిల్‌లో గంటపాటు ధర్నా చేశారు. డీఎస్పీ హేమంత్ అక్కడకు చేరుకుని..ఘటనపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వైభవంగా ముగిసిన పుష్కర కుంభాభిషేకం



చౌడేశ్వరీదేవికి పూజలు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

తాడిమర్రి: పెద్దకోట్ల చౌడేశ్వరీదేవి పుష్కర కుంభాభిషేకం పూజలు సోమవారంతో ముగిశాయి. ఆలయ కమిటీ చైర్మన్ పాటిల్ ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాటిల్ కపిల్‌నాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ గుడి కట్టుదారులు పూజలు జరిగాయి. తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పంచామృతం అభిషేకం, కుంకుమాభిషేకం తదితర అభిషేకాలు చేశారు. అనంతరం వెండి, బంగారు ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున 4.15 నుంచి 5.15 గంటల మధ్య వేద పండితులు చౌడేశ్వరీ దేవి కళాకర్షన అంగన్యాస కరన్యాసం జరిపారు. అలాగే భగవత్ ప్రార్థన, గణపతి ప్రార్థన, మహా కలశ ఆరాధన, ద్వార తోరణం, ధ్వజ కుంభ ఆరాధన, అగ్ని సంస్కరణ, మూల మంత్ర హోమం, ప్రాణదిదశ వాయున్యాసాధి హోమం, షోదశ న్యాసాధి హోమం, కల కర్షణ హోమం, ప్రాయశ్చిత్త హోమం, మహా నివేదన, మహా మంగళ నీరాజనం తదితర పూజలు చేశారు. అనంతరం ఉదయం 9.15 గంటలకు మహా కుంభ ఉద్వాసన, ఆలయ ప్రదక్షిణ అమ్మవారి మూలమూర్తి సంప్రోక్షణ, మహా కలశ శిఖర సంప్రోక్షణ, కూష్మాండ బలిహరణ, గోపృష్ఠ దర్శనం, కన్యాదర్శనం, ఛాయా దర్శనం, మహా భక్తజన దర్శనం, మహా నైవేద్యం, మహా మంగళ నీరాజనం, యజమాన మహా ఆశీర్వచనం తీర్థ ప్రసాద వితరణ తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పుష్కర కుంభాభిషేకానికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్రం శ్రీనివాసరెడ్డి, జొల్లిరెడ్డి అశ్వత్థ, మల్లప్పగారి మాధవరెడ్డి, మారక శివారెడ్డి, హనుమంతరెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు పొరాళ్ల విజయ భాస్కర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు బాబాఫక్రొద్దీన్, ఎంపీటీసీలు పెద్దన్న, చంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అల్లె సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వేధింపులపై కేసు

కదిరి టౌన్: అనుమానం, అదనపు కట్నం కోసం నిత్యం వేధింపులకు గురిచేస్తున్న భర్త షేక్ ఖాదర్‌వలితో పాటు మరిది, అత్త, మామలపై పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన షేక్ నజ్మా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి సోమవారం తెలిపారు.

సీల్డు టెండర్ల ఆహ్వానం

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని ఎనిమిది షాపుల్లో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు సీల్డు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీఎం మైనోద్దీన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నగలు, నగదు మాయం

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని హైపర్‌మార్ట్ పక్కన నివాసముంటున్న హేమావతి ఇంట్లో నగలు, నగదు మాయమయ్యాయి. ఈమె కొద్దిరోజులుగా చీరల వ్యాపారం చేస్తోంది. ఆదివారం అనూషా, అక్షిత అనే మహిళలు చీరల కోసం వచ్చారు. సోమవారం బీరువా తెరిచి చూడగా మూడు తులాల బంగారు లాంగ్ చైన్, ఉంగరం, రూ.30 వేల నగదు కనిపించలేదు. చీరల కోసం వచ్చిన ఆ ఇద్దరు మహిళలే చోరీకి పాల్పడి ఉంటారని బాధితురాలు హేమావతి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

చెన్నేకొత్తపల్లి ఎంపీడీఓగా బాలకృష్ణుడు

చెన్నేకొత్తపల్లి: నూతన ఎంపీడీఓగా బాలకృష్ణుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న శివశంకరప్ప ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు రెగ్యులర్ ఎంపీడీఓగా ఎం.బాలకృష్ణుడిని నియమించారు.

రైతు సలహాలకు స్పెషల్ క్యాంప్

పుట్టపర్తి అర్బన్: వ్యవసాయంలో రైతులకు తగిన సలహాలు అందించడానికి వెంకటేశ్వర వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఏరువాక శాస్త్రవేత్త రామసుబ్బయ్య పేర్కొన్నారు. సోమవారం ఎనుములపల్లి రైతు సేవ కేంద్రంలో జగరాజుపల్లి, కప్పలబండ రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

ముదిగుబ్బ: రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి లక్ష్మీనరసింహులు తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో సిబ్బందితో కలిసి ఆయన భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరించారు.

భూసార పరీక్షకు మట్టి సేకరణ

నల్లచెరువు: అల్లుగుండు గ్రామంలో ఏఓ భారతి ఆధ్వర్యంలో సోమవారం వ్యవసాయ అధికారులు భూసార పరీక్ష కోసం మట్టిని సేకరించారు.

సిమెంట్ కంటైనర్ బోల్తా

పుట్టపర్తి అర్బన్: గువ్వలగుట్టపల్లి బస్టాండ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న జాతీయరహదారి 342 పై సిమెంట్ కంటైనర్ బోల్తాపడింది. సోమవారం తెల్లవారుజామున తాడిపత్రి నుంచి బెంగళూరు వైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న కంటైనర్ మలుపు వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత మృతి

నల్లచెరువు: కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఈ నెల ఆరో తేదీన విషప్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేసి అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత రజిత (25) పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందింది. తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన రజిత, రమేష్ దంపతులు నల్లచెరువు మండలంలో జరుగుతున్న హంద్రీ-నీవా కాలువ పనులు చేయడానికి కూలీలుగా వచ్చారు. అయితే దంపతులు తరచూ ఏదో ఒక విషయంలో గొడవ పడుతూ ఉండేవారు. ఈ క్రమంలోనే ఆమె ఆత్మహత్య చేసుకుంది. రజిత తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మక్బూల్‌బాషా కేసు నమోదు చేశారు.

మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్‌గా ఆరిఫ్

ధర్మవరం అర్బన్: మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్‌గా ఆరిఫ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు.

20న కార్మికుల సమ్మె

ధర్మవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న దేశవ్యాప్తంగా కార్మికులు సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ మండల కన్వీనర్ జె.వి.రమణ, కో కన్వీనర్ అయూబ్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు మున్సిపల్ కార్మిక సంఘం నాయకులతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు

ధర్మవరం అర్బన్: మద్యం అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్ హెచ్చరించారు. పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ స్టేషన్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎక్సైజ్ సీఐ చంద్రమణితో ధర్మవరం ప్రాంతంలో నాటుసారా, బెల్టుషాపుల కట్టడిపై ఆరా తీశారు. అనంతరం కల్లు దుకాణాల నిర్వాహకులతో మాట్లాడారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తనకల్లు: టి.సదుంలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పఠాన్ బషీర్ తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంట్లోని ఫ్రిజ్, టీవీ, మిక్సీ, నిత్యావసర సరుకులు, దుస్తులు కాలి బూడిదయ్యాయి. స్థానికులు గమనించి కరెంటు సరఫరా నిలిపివేసి మంటలు ఆర్పివేశారు. దాదాపు రూ.1.5 లక్షల నష్టం వాటిల్లింది.

చోరీకి విఫలయత్నం

నల్లచెరువు: మండల కేంద్రంలోని సచివాలయం-2 భవనంలో ఆదివారం రాత్రి దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. తలుపుల తాళాలు పగులగొట్టేందుకు ప్రయత్నించగా.. అలికిడి విని స్థానికులు గట్టిగా కేకలు వేయడంతో పారిపోయారు.

నెట్ సెంటర్లో సచివాలయ సెక్యూరిటీ బాండ్లు

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని వాసవి జిరాక్స్-ఇంటర్‌నెట్ సెంటర్లో సచివాలయంలో ఇచ్చే 1బీలు అనధికారికంగా అధిక ధరకు అమ్ముతున్నారని రైతులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ వెంటనే నెట్ సెంటర్‌ను తనిఖీ చేసి సెక్యూరిటి బాండ్లు స్వాధీనం చేసుకున్నారు.

జవాన్‌కు సన్మానం



జవాన్ రంజిత్‌నాయక్‌ను సన్మానిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

పుట్టపర్తి టౌన్: ఆర్మీ క్యాంప్ కార్యాలయ ఆదేశాల మేరకు బ్రాహ్మణపల్లి తండాకు చెందిన జవాన్ రంజిత్ నాయక్ సోమవారం తిరిగి విధులకు బయల్దేరారు. ఈ సందర్భంగా జవాన్‌ను లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి నాయక్, జిల్లా అధ్యక్షుడు విజయకుమార్‌నాయక్, మండలాధ్యక్షుడు రమణనాయక్, రాజేష్ నాయక్, శివకుమార్‌నాయక్, బాలకృష్ణనాయక్, చక్రీనాయక్ తదితరులు సన్మానం చేసి.. సాగనంపారు.

అపూర్వ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని సాయి ఆరామంలో ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 1995-96లో పదో తరగతి పూర్తి చేసిన వారంతా ఒక్కచోట చేరడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అనంతనం తమ ఉన్నతికి ఎంతగానో కృషి చేసిన ఉపాధ్యాయులు మల్లికార్జున, గుప్తా, సులోచన, బస్సోబిలను ఘనంగా సత్కరించారు.

ఆర్డీటీ సేవలు కొనసాగించాలి

తనకల్లు: ఆర్డీటీ సేవలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోటపల్లి గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ శోభా సువర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నరసింహులు, ఆంజినేయులు, లక్ష్మీనారాయణ, నరసింహులు, ఆదినారాయణ, ఆంజినేయులు, సోమశేఖర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి



భాస్కర్‌రెడ్డి (ఫైల్)

తనకల్లు: పరాకువాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దేశాయి భాస్కర్‌రెడ్డి (75) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు గ్రామానికి చేరుకుని భాస్కర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.